# పురుగు

అసిరయ్యా తెల్లవారుజాము అయిదు గంటలకల్లా నిద్ర లేచాడనటం కన్నా పక్కమీద నుంచి లేచి కూర్చున్నా డనటం నిజం. అసలు కంటిమీద కునుకనేది ఉంటే కదా నిద్ర లేవటం? బ్రతుకే కలత నిద్రైపోయింది.

నడిమంచం మీద కూర్చుని మోకాళ్ళు చేతుల మధ్య ఇరికించుకొని కొయ్యబొమ్మలా కూర్చున్న భర్తను అప్పుడే నిద్ర లేచిన రాజమ్మ కళ్ళు నులుముకుంటూ చూసింది. అతని కేసి చూస్తూనే గ్రహించింది అత నేదో దీర్ఘంగా ఆలోచిస్తూ ఉన్నాడని. కొద్ది రోజులుగా ఇదే ధోరణి.

కాస్త మదుగ్గా చావమీద నడుం వాల్చే రాజమ్మకు, భర్త మంచం పక్కనే పెట్టిన కిరసనాయిలు దీపం అతని నీడను గోడమీద చూపెడుతూనే ఉంటుంది. ఆమెకు మెలకువ వచ్చినప్పుడల్లా కొయ్యగుంజ నీడలో కలిసిపోయి నిశ్చలంగా ఉండే భర్త ఆకారమో, నిద్రకోసం పొర్లిగింతలు పెడుతుండే భర్త ఆకారమో నీడలా కదులుతూనే ఉంటుంది.

ఏ రకమైన బాధలు, బరువు బాధ్యతలు, దిగులు భర్త నలా క్రుంగదీస్తున్నాయో ఆమెకు తెలును. అలా డీలా పడిపోతున్న భర్తకు నాలుగు మంచి మాటలతో ధైర్యం చెప్పాలని మనసులో ఉంటుంది. బాదరబందీలతో కొండెక్కిపోతున్న ఆత్మవిశ్వాసాన్ని ఎగదోసేందుకు పరిస్థితులు ఏమాత్రం ఊతం ఇవ్వటం లేదు.

భర్త దైన్యానికి మనసులోనే కుమిలిపోతున్న రాజమ్మ కన్నీళ్ళు కంటిలోనే ఇంకిపోతున్నాయి.

"అప్పుడే లేవకపోతేనేం? కాసేపు పడుకోరాదూ?" లేచి ఇవతల కొచ్చి భర్త నుద్దేశించి అన్నది.

అసిరయ్యా భార్య మాటలకు తలెత్తి ఆమె కేసి చూశాడే గాని, ఉలకనూ లేదు పలకనూ లేదు. రాజమ్మ తలుపు తీసుకుని బయటకు నడిచింది.

వాకిలి ఊడ్చి, పేడ కళ్ళాపి జల్లి, ముగ్గు వేసేసరికి తెల్లవారుతున్నది. ఒక్కొక్కరే నిద్ర లేస్తున్నారు. తలో పనీ అందుకుంటున్నారు. కాస్త ఎండెక్కి గాని పిల్లలు లేవరు.

పెద్ద కొడుకు కావిడిలో చెరువు నీళ్ళు తెచ్చి పోస్తున్నాడు. అసిరయ్యా వాకిటి అరుగుమీద కూర్చుని కచ్చికతో పళ్ళు తోముకొని, ముఖం కడుక్కున్నాడు.

వంటింట్లో పీట వాల్చుకుని చతికిలబడ్డ అసిరయ్యను చూస్తూనే గ్రహించింది రాజమ్మ - భర్త పొలం వెళ్ళే ఉద్దేశంలో ఉన్నాడని. వెళ్ళే ముందు రెండు ముద్దలు చద్దన్నం తినటం మామూలుగా జరిగేదే.

అలవాటు ప్రకారం భర్త ముందు కంచం, మంచినీళ్ళ గ్లాసు ఉంచింది. అన్నం పెట్టటానికి కుండ మూత తీసేసరికి ఆమె మనస్సు కలుక్కుమన్నది. గుప్పెడు మెతుకులన్నా లేవు.

నిద్ర లేస్తూనే ఆవురావురుమంటూ పిల్ల లిద్దరూ గోలపెడ్తారు. ఆ ముద్ద తిని బడికి వెళ్తే తిరిగి పన్నెండు గంటలకే బడి నుంచొచ్చేది. ఉన్న కాస్తా భర్తకు పెడితే వాళ్ళను సముదాయించట మెలాగా?

మూడు రోజుల క్రితమే, డబ్బులు నిదానంగా ఇవ్వొచ్చు ఎవ రోకర్ని అడిగి ఒక బస్తా ధాన్యం ఆడించమని పెద్ద కొడుక్కి చెప్పింది.

చూస్తే మట్టికుండలో అడుగంటిన చిక్కని మజ్జిగ మాత్రం కనిపించాయి. అందులోనే రెండు గ్లాసుల నీళ్ళు తొలిపి ఒక గ్లాసెడు మజ్జిగ భర్తకు అందించింది. మారు మాట్లాడకుండా అందుకున్నాడు.

"నిన్ననే బియ్యం నిండుకున్నాయి. అన్నం పిల్లలకే చాలీచాలకుండా ఉంది. పెద్దోడు మూడ్రోజుల నుండీ ఊరంతా తిరుగుతూనే ఉన్నాడు. అదిగో ఇదిగో అంటూ చిన్నయ్య ఒక బస్తా ఇచ్చాడట నిన్న సాయంత్రం. తీరా మిల్లుకు మోసుకెళ్ళేసరికి కరెంటు పోనే పోయిందిట. పొద్దుటే ఆడించి ఇస్తాం రమ్మన్నారట." అసిరయ్యా అడక్కపోయినా చెప్పింది.

అసిరయ్యా మజ్జిగ నీళ్ళు గొంతులో పోసుకుని గ్లాసు భార్య చేతి కందించి బయటకు నడిచాడు.

పెట్టిన కంచం పెట్టినట్లే తీయవలసి వచ్చినందుకు రాజమ్మ కళ్ళలో నీరు ఉబికింది. నాలుగైదేళ్ళుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నప్పటికీ ఇంత దారుణం ఎన్నడూ లేదు.

వల్లూరు శివప్రసాద్

పదేళ్ళ క్రితం నాటి ఆ ఇంటి వైభవం ఒక్కసారిగా కళ్ళముందు మెదిలింది.

సంవత్సరం పొడుగునా ఇల్లు పురుగు నిండిన ధాన్యం వాసనతో నిండి ఉండేది. పాలు, పెరుగుల వాసనతో వంటిల్లు గుప్పు మంటుండేది. పశువుల మందతో కళ కళలాడే దొడ్డంత పేడ, పచ్చగడ్డి వాసనతో గిరికీలు కొడుతుండేది.

ఇప్పుడు ఆ పంటా లేదు, పాడీ లేదు. ఇల్లు, దొడ్డి అంత ఒకటే మట్టికంపు.

** ** **

ఊళ్ళో రైతుల ముఖాలు చీడపట్టిన ఆకుల్లా వడలి వెలవెల బోతున్నాయి. ఏ కొమ్మ జూసినా, రెమ్మ చూసినా, పువ్వు జూసినా, కాయ జూసినా ఒకటే పురుగు. ప్రత్తి మొక్కలనిండా పుట్టల కొద్దీ పచ్చపురుగు. పురుగు పోటుకు బంగారం లాంటి పూత తెగి నేల రాలుతున్నది.

మూడేళ్ళ బట్టీ ఏ ఏటి కాయేడు గట్టెక్కకపోతామా అన్న ఆశేగాని ఒడ్డున పడే దారి కనపట్టంలేదు. విత్తు నాటిన దగ్గర్నుంచి కాయ వలిచేదాకా అన్నీ గండాలే. సకాలంలో వర్షా లుండవు. ఉన్నా దిగుబడి అంతంత మాత్రమే. దిగుబడి ఉన్నా లంకమేత సామెతలా గిట్టుబాటు కాని ధరలు. అప్పోసప్పో చేసి పెట్టిన పెట్టుబడంతా సుడిగాలిలో దుమ్ములా కొట్టుకుపోవటమే. ఆదాయం ఉన్న రైతు గాని, అప్పు చేయని రైతు గాని ఊళ్ళో లేడు.

ఈ ఏడాది పరిస్థితి మరీ అధ్వాన్నమైంది. వర్షం సరిగా లేక విత్తిన గింజ చచ్చి ఊరుకున్నది. మళ్ళీ వర్షం జల్లుకు నాటిన గింజ మొలిచి మొక్క ఏపుగా ఎదిగి పూతమీద కొచ్చి కాపు మొదలయ్యేసరికి పంట పురుగు వాత పడింది. పందల కొద్దీ అప్పు చేసి పురుగు మందులు ఊపిరాడకుండా కొట్టారు. ఫలితం కనిపించలేదు.

అసలు అప్పు పుట్టక, ఒకవేళ ఆడవాళ్ళ మెడల్లో పుస్తెలో, చేతి గాజులో తనఖా మీద పుట్టినా గిట్టదని రైతులంతా చేతులు ముడుచుకు కూర్చున్నారు. ఎకరానికి ఒకటి మహా అయిందనుకుంటే రెండు క్వింటాళ్ళు మించి కాదని అంచనా వేసుకుని ఉసూరు మంటున్నారు.

ఉన్నట్టుండి అనూహ్యంగా రెట్టింపైన పత్తి ధర రైతుల్లో అడుగంటిన ఆశను ఎగదోసింది. పురుగును అరికట్టి ఒకటో రెండో క్వింటాళ్ళు అదనంగా పండించగలిగితే ఖర్చులు పోను పదో పరకో చేతి కందుతా యని ఆరాటపడసాగారు. ఆడవాళ్ళ ఒంటిమీద ఇంకా మిగిలున్న బంగారం ఒలిచి అప్పు పుడ్తుందన్న చోటికల్లా ఎగబడ్డారు. అదీ లేనివాళ్ళు తలలు తనఖా పెట్టి పురుగు మందుల కొట్లో ఖాతాలు తెరిచారు.

మందు వ్యాపారస్థుల దశ తిరిగినట్లయింది. అదేపనిగా లారీల కొద్దీ పురుగు మందులు లోడు దించేస్తున్నారు. పూర్తి రొక్కానికే కొందరి కిస్తే నమ్మక మనుకున్న వాళ్ళకి పూర్తి అప్పులూ ఇస్తున్నారు. మరి కొందరికి కొంత రొక్కంకింద, కొంత అప్పుకింద సరఫరా చేస్తున్నారు.

ఒక్కసారిగా రైతుల్లో చైతన్యం వచ్చింది. ఇంటిల్లిపాదీ చీకటితోనే నిద్రలేచి స్ప్రేయర్లు భుజానేసుకుని మోయలేక మోస్తూ పొలాలకు పరిగెడుతున్నారు. మోటార్ల బరబరలతో ఆకాశం హోరెత్తిపోతున్నది. ఊరి పొలిమేరలు మందుల కంపుతో వెగటు పుట్టిస్తున్నాయి.

మందులకు పురుగు చస్తుందన్న నమ్మకం లేనివాళ్ళు పురుగులు ఏరించేందుకు ఏకంగా కూలీలనే పెడుతున్నారు. వంద పురుగులు ఏరితే నాలుగు రూపాయలు. పిల్లా పీచని లేకుండా కూలి నాలి జనానికి ఎక్కడలేని గిరాకీ తగిలింది. మొక్కల మీద పిట్టల్లా పడి తలకొక వెయ్యి పురుగులు జమాయించి ఏరి పారేస్తున్నారు.

మందులు చల్లి పురుగులు ఏరించి ఇంత శ్రమ పడితే పంట ఏమాత్రం చేతి కందుతుందనే దానిమీద ఎవరికీ సరైన అంచనా లేదు. ఇదంతా ఆశ - ఆరాటం - ప్రకృతితో పోరాటం !

అసిరయ్య బ్రతుకు సాటి రైతులకు భిన్నంగా లేదు. అంతా ఒకే గూటి పక్షులు. ఉన్న కొద్దిపాటి వ్యత్యాసమల్లా పెద్దా చిన్నా రైతుల మధ్య పరిస్థితులను నిభాయించుకోగలగటంలోనే ఉన్నది. పెద్ద రైతు క్రుంగుతుంటే, చిన్న రైతు మరీ చితికి పోతున్నాడు.

నాలుగైదేళ్ళ బట్టీ చేస్తున్న అప్పు వడ్డీలను జత చేసుకుని జీవితాన్ని కారుచిచ్చులా చుట్టేస్తున్నది. కాస్త పంట పండి ఆదాయం వచ్చిందనుకున్న ఏడాది పెద్ద కొడుకు పెళ్ళి మాత్రం చేయగలిగాడు. కొడుకూ ఇద్దరు పిల్లల తండ్రయినాడు. కుటుంబం పెరిగింది.

కూతురు పెళ్ళి కెదిగినా అప్పుల భయంతో ఏ ఏటి కాయేడు నెట్టుకొచ్చాడు. ఎంత కాలమని అలా వాయిదా వేయగలడు? వైశాఖ మాసం నాటికి డబ్బు చేతి కొస్తుందన్న ధైర్యంతో నిశ్చితార్థం చేసుకున్నారు. కూతురి పెళ్ళని కాళ్ళావేళ్ళా పడి అప్పుల వాళ్ళకు కొంత జమ వేసి, మిగిలిన దానితో ఎలాగోలా ఆ మూడు ముళ్ళూ వేయించగలిగితే తన బాధ్యత తీరిపోతుం దనుకున్నాడు.

డిగ్రీ దాకా చదువుకున్న చిన్న కొడుక్కి ఉద్యోగమూ రాలేదు, వ్యవసాయమూ చేతకాని వాడైనాడు. కొడుకు చదువుకోసమని ఖర్చు చేసినది మాత్రం తక్కువా?

పాత అప్పు దాని కదే పెరుగుతున్నది. దానికి తోడు వ్యవసాయ ఖర్చుల కోసం ప్రోనోట్లు రాసి, బంగారం కుదువబెట్టి ఈ ఏడాది మళ్ళా అప్పు. అయిదెకరాల పొలం ఉండీ ఇల్లు జరుగుబాటు కనాకష్టమైపోయింది.

ఊరిలో సాటి రైతుల హడావుడి గమనిస్తూనే ఉన్నాడు. నలుగురితో పాటు తనూ మందులు చల్లి పురుగు అదుపు చేస్తే నాలుగు డబ్బులు అదనంగా రావచ్చు. అందుకు పెట్టుబడి కావాలిగా?

ఉత్తినే కాళ్ళూ చేతులు ముడుచుకుని ఇంట్లో కూర్చోలేక పొలం బయల్దేరాడే గాని నిజానికి వెళ్ళి చేయాల్సిన పనీలేదు. దారి పొడుగునా పొలాల్లో హడావుడి కనిపిస్తూనే ఉన్నది. కొందరు మందులు చల్లుతున్నారు. కొందరు పురుగులు ఏరిస్తున్నారు.

చేనంతా కలయదిరిగాడు. ఏ మొక్క చూసినా లుకలుకలాడుతూ పచ్చ పురుగులు. సౌభాగ్యం మట్టి పాలవుతున్నట్లుగా పురుగు పాటుకు నేల రాలుతున్న పూత. పురుగు కాయను జల్లెడ కింద కొట్టి పారేస్తున్నది. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే పంట ఏమాత్రం దక్కేను? ఎకరాకి మూడు వేల చొప్పున పురుగు మందులకే తగలేశాడు. పురుగూ చావలేదు, పూతా నిలవలేదు. తలచుకుంటున్న కొద్దీ అసిరయ్య కళ్ళు చెమ్మగిల్లాయి.

జర్నలిస్టు: సామాన్య ప్రజలపై మీ అభిప్రాయం?
మంత్రి: ఎన్నికల ముందు వాళ్ళు మాకు మాన్యులు. తర్వాత సామాన్యులే గదా!

నిమ్మరాజు చంద్రభాను [గుంటూరు]

## ఎలా?

ఓకొత్త ఇల్లు కడుతున్నారు. కూలీలు పనిచేస్తున్నారు. అందులో ఓ కూలి ఇలా అన్నాడు తన మేస్త్రీతో-ఉ"అయ్యా! నా గంప కనపడ్డం లేదు" అని. "ఇంకేం ఈ రోజంతా విశ్రాంతి తీసుకో" అన్నాడు మేస్త్రీ.

"అందరూ తమ తమ గంపలను తలగడగా పెట్టుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. మరినేనెలా తీసుకోను-విశ్రాంతి?"

చాగాపురం

తన ఆశలను అన్ని విధాలా ధ్వంసం చేస్తున్న పురుగుల్ని చూస్తూ ఉత్తినే నిలబడలేకపోయాడు. మొక్కల మీదకు ఎగబడి ఒక్కో పురుగును పట్టి ఒడిలో వేసుకోసాగేడు. ఒక్కడే ఎన్ని పురుగులని ఏరగలడు? ఎన్నింటిని చంపగలడు?

చేల మధ్య డొంకమీద వెళ్తున్న మోపెడ్ ఆగింది. ఆ శబ్దానికి అసిరయ్య తలెత్తి చూశాడు. కృష్ణమూర్తిని గుర్తించాడు. అతను స్టాండు వేసి గట్లమీదుగా లోపలకు రావటం చూసి తనూ మొక్కల మధ్య నుంచి గట్టుమీద కొచ్చాడు.

"పంట ఎలా ఉంది అసిరయ్యగారూ?" పలకరించాడు కృష్ణమూర్తి.

అసిరయ్య అంతదాకా ఏరిన గుప్పెడు పురుగుల ముద్దను ఒడిలో నుంచి గుమ్మరించి చెప్పుతో కసపిసా నలుపుతూ, "ఇట్లా ఉంది !" అన్నాడు నిరాశ ధ్వనిస్తున్న స్వరంతో.

"చాలావరకు అలానే ఉందిలెండి. రేటు బాగానే ఉంది. ఒకటి, రెండు క్వింటాళ్ళు అదనంగా అయితే గిట్టుబాటు బాగుంటుంది. అంతా ఆదేపనిగా మందులు కొడ్తున్నారు. మీరూ కొట్టించకపోయారూ?" అన్నాడు.

"అవకాశం ఉన్నంత దాకా ఊడ్చి తెచ్చి పురుల పాల బడేశాను. ఇంకా ఎక్కడ్నుంచి తెచ్చేది?" అన్నాడు నిట్టూరుస్తూ అసిరయ్య.

కృష్ణమూర్తి రెండు నిమిషాలు ఆలోచించాడు. "ఓ పని చేద్దాం. టౌన్‌లో నాకు తెలిసిన షావుకారు ఉన్నాడు. నే నెంత చెప్తే అంత. అరు విప్పిస్తాను. పంటొచ్చినప్పుడు చూసుకుందాంలే" అన్నాడు కృష్ణమూర్తి భరోసాగా.

అసిరయ్య వెంటనే అవునని గాని, కాదని గాని అనలేకపోయాడు. అప్పంటేనే గుండె దడ పుడుతున్నది. అలాగని వదిలేస్తే పురుగు దెబ్బకు క్వింటాలన్నా చేతికి అందేట్లు లేదు. ఎటూ వేలకు వేలు తగలేశాడు. ఇంత దాకా వచ్చి కాడికింద పారెయ్యటానికి మనసొప్పలేదు. అవసరాలు ఆశ పెట్టాయి. ఆశ ధైర్యాన్నిచ్చింది. ఆ ధైర్యమే సరే ననిపించింది.


"అలా పైకి వెళ్ళి అరగంటలో తిరిగొస్తాను. నా బండిమీదనే టౌన్ కెళ్ళాం" అని చెప్పి తిరిగి బయల్దేరాడు కృష్ణమూర్తి.

ఒక గంట తరువాత ఇద్దరూ టౌన్ కేసి బయల్దేరారు. ఆ ఊరికి టౌన్ మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. దారి పొడుగునా చేయబోతున్న అప్పు గురించి ఆలోచిస్తూనే ఉన్నాడు అఇరయ్య.

కృష్ణమూర్తి ప్రత్తి వ్యాపారం చేస్తుంటాడు. చిల్లర మల్లరగా రైతుల దగ్గర ప్రత్తి కొని మూడు, నాలుగు కంపెనీలకు లోడు చేస్తుంటాడు. ఈ రకంగా అమ్మటంవల్ల రైతులకు క్వింటాలుకి పాతికో పరకో తక్కువే వస్తాయి. అయితే కాలు కదపనవసరం లేకుండా, సరు కెత్తిన వారం రోజుల్లో డబ్బు చేతి కందుతుందని నలుగురూ నమ్మకం మీద అతనికే సరుకు ఇస్తుంటారు.

కాటా వేయించటంలో కొద్దిపాటి తేడాలు, సరుకు అమ్మటంలో చూపే తెలివితేటలు, నలుగురూ అనుకునే దానికన్నా ఎక్కువే లాభిస్తాయన్న నిజం అత నొక్కడికే తెలును. భూమిని నమ్ముకున్న రైతు ఈ నాలుగేళ్ళ బట్టీ అప్పుల్లో మునుగుతుంటే వ్యాపారాన్ని నమ్ముకున్న అతను వేల కొద్దీ ఆదాయంతో సౌఖ్యంలో తేలిపోతున్నాడు.

వెళ్ళిన పని తొందరగానే అయింది. అయిదెకరాలకు రెండు దఫాలుగా



చల్లించేందుకు పది లీటర్ల మందు తీసుకున్నాడు. మొత్తం రెండు వేల నాలుగు వందల చిల్లరయింది. రొక్కంగా కొంత పుచ్చుకుని రెండు వేల అయిదు వందలకు సరి సంఖ్యగా ఖాతా పుస్తకంలో వేలి ముద్ర వేశాడు. వేలికి సిరా పులుముకుని ముద్ర వొత్తుతుంటే చేయి వణికింది.

"హామీ నేను. పంట రావటమే ఆలస్యం. ఆయన తరవున నేను జమ చేస్తాను." కృష్ణమూర్తి ఫెర్టిలైజర్ షాపు వాళ్ళకు నమ్మకంగా చెప్పాడు.

మందు డబ్బాలు పేక్ చేయించుకుని ఇద్దరూ బయటి కొచ్చారు.

"కృష్ణమూర్తీ సమయానికి దేవుడిలా ఆదుకున్నావయ్యా. ఏట్లో మునిగే వాణ్ణి ఒడ్డున పడేశావు" అన్నాడు అసిరయ్య కృతజ్ఞతగా.

"మాట సాయం తప్పితే నే చేసిందేముంది లెండి?" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

వేరే పని ఉందంటూ కృష్ణమూర్తి తన దారిన తను వెళ్ళిపోయాడు.

అసిరయ్య పురుగు మందుల పెట్టె నెత్తి కెత్తుకున్నాడు. బస్టాండ్ దాకా రెండ్రూపాయలు రిక్షాకి పెట్టేందుకు మనసొప్పలేదు. అర్ధ గంటలో బస్ స్టాండ్ చేరుకున్నాడు.

అప్పటికే మధ్యాహ్నం దాటింది. అసిరయ్య చీకటి ముఖాన తాగిన గ్లాసెడు మజ్జిగ ఎప్పుడో ఇంకిపోయింది. ఆకలి నకనకలాడుతున్నది. ప్రాణం శోష కొచ్చినట్లున్నది. కాఫీ నీళ్ళన్నా కడుపులో పడందే ఇంటికి చేరే ఓపిక రాదనిపించింది.

కాకా హెూటల్‌లో ముప్పావలా ఇచ్చి సింగిల్ కాఫీ తాగేడు. ప్రాణం కాస్త కుదుటపడింది.

అంతలో బస్సు రానే వచ్చింది.

చేజారిపోతున్న దనుకున్న పంట చేతి కందినంత ఆనందం అసిరయ్యకు అప్పుడే కలిగింది. ఇప్పుడున్న రేటులో ఎకరాకి నాలుగు క్వింటాళ్ళైనా ఆదాయం సంగతెలా ఉన్నా పెట్టుబడికి దండగరాదు.

మందులు చూస్తూనే పెద్ద కొడుకు ఆశ్చర్యపడ్డాడు.

"డబ్బెక్కడిది నాన్నా?" అడిగాడు.

"అప్పుగా తెచ్చాన్లే. నలుగురితో పాటు మనమూ తెగించాలి" చెప్పాడు.

కొడుకు, రాజమ్మ మందు డబ్బాల కేసి బితుకు బితుకుమంటూ చూశారు.

అసిరయ్యలో తిరిగి ఉత్తేజం పుంజుకుంటున్నది. చీకటితోనే రెండ్రోజులు ఇంటిల్లిపాదీ చేనుకు పరిగెత్తారు. ఒక విడత మందు జల్లటం పూర్తయింది.

మందు కలిపేటప్పుడు కొడుకు అనుమానపడ్డాడు.

"ఈ మందు సరైనదేనా నాన్నా?" అడిగాడు.

"కృష్ణమూర్తికి బాగా తెలిసిన కొట్లో ఇప్పిస్తేను. తేడా ఎందుకొస్తుందిలే?" అన్నాడు అసిరయ్య.

"మందు అంత చిక్కగా ఉన్నట్లూ లేదు. సరిగ్గా నీళ్ళలో కలుస్తున్నట్లూ లేదు." అన్నాడు కొడుకు తనకున్న అనుభవం నుంచి.

"నీ ముఖం ! అప్పిస్తే మాత్రం నాసిరకం సరుకిస్తారా?" అంటూ కొడుకు అనుమానాన్ని ఖాతరు చెయ్యలేదు.

అసిరయ్య మర్నాడు చేనుకొచ్చాడు. అంతా కలయదిరిగాడు. పురుగు చావనట్లు



అనిపించింది. కొడుకు మనస్సులో రేకెత్తించిన అనుమానం అలాంటి భ్రమకు గురి చేస్తున్నదేమో అనుకున్నాడు.

వరుసగా నాలుగు రోజులు చేసంతా పరిశీలిస్తూనే ఉన్నాడు. పురుగులు పూతను, కాయను కొరికేస్తూనే ఉన్నాయి. మందు జల్లినా ఫలితం ఏమాత్రం కనిపించటంలేదు. అప్పుడు గాని కొడుకు అనుమాన పడటంలో నిజం ఉందేమో అన్న సందేహం కలగలేదు.

కృష్ణమూర్తి కనిపిస్తే అడిగాడు. "ఆ షాపువాళ్ళు చాలా నమ్మకస్తులు. అసలు ఇప్పుడు పుట్టే పురుగే అంత. ఓ పట్టాన చావటంలేదు" అన్నాడు.

రెండవసారి కూడా మందు కొట్టించాడు. పురుగు ఉధృతం ఏమాత్రం తగ్గలేదు. మందులో మోసం ఉండే ఉండాలి. లేకుంటే ఎక్కడి పురుగక్కడే చావకుండా ఇలానే ఉంటుందా?

అసిరయ్య ఈ విషయం తేలిగ్గా వదిలిపెట్టదలచలేదు. తను కొన్న మందులు మంచివో, కల్తీవో పరీక్ష చేయించా లనుకున్నాడు.

చదువుసంధ్యలు లేని తనలాటోడి గోడు ఈ ఆఫీసర్లు ఒక పట్టాన చెవినేసుకుంటారా? ఇదిగో అదిగో అంటూ మళ్ళీ తొలకరి దాకా తిప్పుతోనే ఉంటారు. చిన్న కొడుకు చదువుకున్న వాడు కాబట్టి, ఈ పని అప్పగిస్తే బావుంటుందనుకున్నాడు.

డబ్బాల్లో అడుగుబొడుగు మిగిలినది ఒక దాంట్లోకి వంచి అది కొడుకు చేతిలో పెట్టాడు.

"చిన్నోడా ! ఇది కల్తీ మందని అనుమానం. టౌనుకి తీసికెళ్ళి నిజం తెలుసుకురావాలి. ఆ గొడవలన్నీ నాకు తెలవదు." అప్పగించాడు కొడుక్కి.

కొడుకు టౌనుకి తిరిగినవాడు తిరిగినట్లే ఉన్నాడు. అసిరయ్య కొడుకును రోజూ అడిగినవాడు అడిగినట్లే ఉన్నాడు. ఇదిగో అదిగో అంటుంటే కొడుకును కసురుకున్నాడు కూడా.

"గవర్నమెంటు ఆఫీసుల్లో పనంటే ఒక పట్టాన తెములుతుందా. ఎవడూ తీరిగ్గా ఉన్నట్లు కనిపించడు. ఏ పనీ జరగదు" అన్నాడు.

రోజూ పొలం వెళ్ళి పంటను కొట్టిపారేస్తున్న పురుగును చూస్తూనే ఉన్నాడు. రోజు రోజుకూ సర్వనాశనం అయిపోతున్నది. ఏం చెయ్యటానికీ కాళ్ళు చేతులు ఆడటంలేదు.

చివరకు నిజం బయటపడింది.

"నాన్నా ! మనల్ని షాపువాడు మోసం చేశాడు. ఆ మందు కల్తీదేనట. మనం రిపోర్టు రాసిస్తే వాళ్ళమీద చర్య తీసుకుంటారట." చెప్పాడు చిన్న కొడుకు.


"ఏం చేస్తారు? వాలు కుదిరితే దొరికినంత మింగుతారు. లేకుంటే జైలో, జరిమానానో ఏస్తారు. అంతేనా ! పడ్డ నష్టం ఎవడన్నా కడతాడంటావా?" అన్నాడు పెద్ద కొడుకు బాధగా.

అసిరయ్య కొద్దిసేపు ఏం మాట్లాడలేకపోయాడు. అతనిలో ఆవేశం నిప్పులా రాజుకోసాగింది.

సరుకు కొన్న నష్టం దాదాపు రెండు వేల అయిదొందలు. కాని వాడు చేసిన మోసంవల్ల అయిదెకరాల పంట సర్వనాశనం అయింది. ఇంత నష్టం ఏ విధంగా పూడుతుంది? అప్పు కొంత తీరుతుందని, కూతురి పెళ్ళి జరిగిపోతుందనీ ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు? పరువు, మర్యాద మంట గలవబోతున్నాయి. పరిస్థితులు బ్రతుకుల్ని రచ్చ కీడుస్తాయి.

కృష్ణమూర్తి ఎంత నమ్మకంగా చెప్పాడు? తడిగుడ్డతో గొంతులు కొయ్యటమంటే ఇదే కదూ? ఆ కొట్టువాడిచ్చే కమీషన్ డబ్బుకి కక్కుర్తిపడి బంగారం లాంటి పంటను పురుగుల నోట పెట్టాడు.

వాన పాటుకు, పాము కాటుకు వెరవకుండా ఆరుగాలం కష్టపడే తన లాంటోళ్ళకు దక్కుతుందేమిటి? కడుపులో ఆకలి, కంటినిండా నీళ్ళు. ఏళ్ళ తరబడి తమ బతుకుల్ని ఇట్లాంటి


SURYA

ఒకనాడు శక్తులన్నీ సహకరించుకుని, రాక్షస సంహారం చేశాయి.

రాక్షసులు త్రిమూర్తులకే అజేయంగా నిల్చింటే, 'శక్తులు' ఉద్భవించి ఐకమత్యంతో పోరాడి రాక్షస సంహారం చేశాయి.

తల నరికే శక్తి తల నరికితే, ఇంకో శక్తి వాడి దేహం నుండి బొట్టు కింద పడకుండా రక్తం తాగి - అలాగా రాక్షస సంహారం చేశాయి.

ఈ నాటి శక్తులకు ఐకమత్యం లేదు.

ఈనాడు పురుష రాక్షసులు ఆచారాల న్న యంత్రాలతో, సంప్రదాయాలన్న మంత్రాలతో ఈ శక్తులను భానిసలుగా చేశారు.

మరి వీరి బారి నుండి ఈ శక్తులు బయట పడలేవా?

# చివుకుల పురుషోత్తం

## సీరియల్

# సుకన్య

## వచ్చే సంచికలో ప్రారంభం

ఫోటో: ఎ. జోషి [హైదరాబాద్]



దళారీలకు, దగుల్బాజీలకు ఎరవేస్తూ మొసలి కన్నీరెడుతున్నారు. చావకుండానే తమ బ్రతుకుల్ని ఇలాంటి రాబందులు తన్నుకెళ్తుంటే పట్టించుకున్న దెవరు?

అసిరయ్య గుండెలో ఆవేశం అగ్నిలా భగ్గున మండింది. కళ్ళు చింతనిప్పుల్లా మండుతున్నాయి. పిడికిళ్ళు బిగునుకున్నాయి. మహాశక్తిలా లేచి నిలబడ్డాడు. పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ టౌన్ కేసి బయల్దేరాడు.

అసిరయ్య ఉగ్రనరసింహంలా తను పురుగు మందులు కొన్న కొట్టులోకి అడుగు పెట్టాడు. కృష్ణమూర్తి కూడా ఆ సమయానికి అక్కడే ఉన్నాడు.

"రొక్కానికి మంచి మందులు, అరువుకి కల్తీ మందులు ఇస్తారా మీరు?" కరుగ్గా అడిగాడు అసిరయ్య.

కొట్టువాడు ఆ మాటలకు ఉలిక్కిపడ్డాడు. వెంటనే సర్దుకుని మేకపోతు గాంభీర్యంతో బుకాయించబోయాడు.

"నోటి కొచ్చినట్లు మాట్లాడకు. వెర్రికేకలు పెట్టటానికి ఇది మీ పశువుల దొడ్డికాదు" అన్నాడు బెదిరింపుగా.

అసిరయ్యలో ఆవేశం .కట్టలు తెంచుకున్నది. టేబుల్ రెండు చేతులతో ఎత్తి అతనిమీదకు నెట్టాడు. అతను వెల కిలా పట్టాడు. వారించబోయిన కృష్ణమూర్తి అసిరయ్య చేతి దెబ్బకు రోడ్డుమీద కొచ్చి పడ్డాడు.

"ఈ వెధవలు పెట్టే ఎంగిలి కూటికి ఆశపడి మోసం చేస్తావురా?" అంటూ పళ్ళు పటపటా నూరేడు.

కోపంతో చేతి కందిన ఖాతా పుస్తకాలు, మందు డబ్బాలు వీథిలోకి విసిరి పారేస్తున్నాడు అసిరయ్య.

కొట్టు యజమాని, షాపు గుమాస్తాలు అసిరయ్య మీద దౌర్జన్యానికి దిగారు. వాళ్ళ దెబ్బల్ని లక్ష్యపెట్టటం లేదు అసిరయ్య. అతని లక్ష్యమల్లా ఒక్కటే. తనలాంటి రైతుల కుటుంబాలు ఇలాంటి మోసగాళ్ళ వల్ల బజారెక్కకూడదు. తగినశాస్తి జరగాలి.

మందులు కొనటానికని అక్కడకు వచ్చి ఉన్న రైతులు పరిస్థితి అర్థం చేసుకుని అసిరయ్యకు అండగా నిలిచారు. చేతులు కలిశాయి. తలలు పగిలాయి.

నిమిషాల్లో మందు డబ్బాలు రోడ్డు పాలయ్యాయి. కొట్టు ధ్వంసమైంది.

అంతలో వేగంగా పోలీసు వాన్ వచ్చి కొట్టు ముందు ఆగింది. పోలీసులు రైతుల్ని వలయంలా చుట్టుముట్టారు.

"రండి బాబూ! పురుగు చస్తే చాలు మా పంట మాకు దక్కుతుందని భ్రమలో పడిపోయాం. వేలకు వేలు పురుగు మందుల కోసం తగలేస్తున్నాం. కాని కల్తీ మందులు అమ్మి రైతుల్ని మోసం చేసే ఇట్లాంటి పురుగుల్ని ఏరిపారేస్తే గాని మా బ్రతుకులకు పట్టిన చీడ తొలగదయ్యా! మా మొక్కలకు పట్టిన పురుగుల్ని ఏరిపారేసేవాళ్ళకు ఇంతని మేం కూలి డబ్బు లిస్తున్నాం. మరి బ్రతుకుల్నే కూలగొట్టే ఇట్లాంటి చీడపురుగుల్ని ఏరిపారేసేందుకు మీరంతా నాకు ఎంతిస్తారో చెప్పండయ్యా!" ఉద్రేకంతో ఊగిపోతూ అరుస్తున్న అసిరయ్యను అడ్డుకోవటానికి ఆ క్షణంలో ఎవరికీ ధైర్యం చాలలేదు. ◆